పహల్గాం మృతులకు సిఎం నివాళి

- నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం జిల్లా బైసరన్‌లో 28 మంది టూరిస్టులను టెర్రరిస్టులు కాల్చి చంపిన ఘటనలో మృతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. తీవ్రవాదుల అరాచక చర్యలను ఖండించారు. ఉగ్రదాడులు, ప్రస్తుతం అక్కడి పరిస్థితి, తాజా పరిణామాలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతరులతో చర్చించారు. గురువారం హైదరాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ కమాండ్ సెంటర్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సిఎంతోపాటు ఎఐసిసి ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపిలు మల్లు రవి, రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కొవ్వొత్తుల ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎఐసిసి ఆదేశాలు ఇచ్చింది. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన జరగనుంది.

సిఎంకు ఇండియా జస్టిస్ రిపోర్టు

రాష్ట్ర పోలీసులు అధికారులు సిఎం రేవంత్‌కు ఇండియా జస్టిస్ రిపోర్టు-2025ని అందజేశారు. తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డిలను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సైతం ఉన్నారు.

సింజెంటా 'బయో ఆగ్ కాంగ్రెస్' రోడ్‌మ్యాప్

హైదరాబాద్ : వినూత్నమైన బయోలాజికల్స్ ద్వారా పర్యావరణ అనుకూల వ్యవసాయాన్ని పెంపొందించేందుకు బయో ఆగ్ కాంగ్రెస్‌ను నిర్వహించినట్లు సింజెంటా ఇండియా తెలిపింది. 2050 నాటికి 50 శాతం ఎక్కువ పంటలు పండించాల్సిన అవసరం ఉన్నందున ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, సరసమైన రీతిలో ఆహారాన్ని అందించడానికి వీలుగా రోడ్‌మ్యాప్ ప్రణాళికలను ఆవిష్కరించినట్లు సింజెంటా ఇండియా ఎండి సుశీల్ కుమార్ పేర్కొన్నారు. ఆహార భద్రతకు హామీ ఇవ్వడంలో రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. వీటి పరిష్కారానికి వినూత్న పరిష్కారాలు అవసరమన్నారు.

ప్రపంచానికి మోడల్‌గా తెలంగాణ

- అందుకే 'భారత్ సమ్మిట్'
- నేడు, రేపు హెచ్ఐసిసిలో మీటింగ్
- సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆధునిక ఆలోచనలతో తెలంగాణను ప్రపంచానికి ఒక మోడల్‌గా చూపడానికే భారత్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన అహింసా, సత్యం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై చర్చించేందుకు100 దేశాలకు పైబడిన ప్రభుత్వ అధినేతలు, ఎంపిలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలు, థింక్ ట్యాంకర్లు తదితరులతో ప్రపంచవ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరు కానున్నారు. ఈ సమ్మిట్ శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవాటెల్‌లో జరగనుంది. 'భారత్ సమ్మిట్: డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్' అనే థిమ్‌తో సర్కారు చేపడుతున్నది. ఆర్థిక న్యాయం, రాజకీయ, సాంఘీక న్యాయం, క్లైమేట్ జస్టిస్, సోషల్‌మీడియా, టెక్నాలజీ తదితర ఆరు అంశాలపై ఈ సమ్మిట్‌లో చర్చించనున్నది. ఆనాడు ప్రపంచవ్యాప్తంగా రెండు బలమైన దేశాలు అమెరికా, రష్యా మధ్య కోల్డ్‌వార్ నడుస్తుండగా, ఎదుగుతున్న భారతదేశం అలీన విధానాన్ని ఆచరిస్తూ ముందుకు వెళ్లింది. దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీగా కాంగ్రెస్ నిలబడింది. అలీన విధానాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ముందుకు తీసుకువెళ్లాయని గుర్తుచేసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులను వివిధ అంశాలపై రెండు రోజులపాటు చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధి, వనరులు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వివరించేందుకు ప్రత్యేక స్లాట్ కేటాయించింది. ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలిపేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుంది. జెండర్, యూత్, న్యాయం తదితర అంశాలను ప్రజలకు చెప్పి వాటిని ఈ ప్రపంచానికి చాటేందుకు ఈ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సైతం ఇందులో పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏర్పాట్ల పరిశీలన

హెచ్ఐసిసి నోవాటెల్‌లో జరగనున్న భారత్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎఐసిసి ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. సమ్మిట్ థీమ్ పోస్టర్లు, స్టాళ్లను తిలకించారు. వీరివెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఎఐసిసి కార్యదర్శి గురుదీప్ సింగ్ సప్పల్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఉగ్రవాద దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి

- దుండగులను కఠినంగా శిక్షించాలి
- దాడిని పసిగట్టకపోవడం దురదృష్టకరం
- సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు
- గోల్కొండ చౌరస్తా వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, అమాయకులైన ప్రజలను తుపాకులతో కాల్చి చంపడం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు అన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి.. దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో పోలీసు వ్యవస్థ, భద్రత దళాలు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటాయని, అయినా ఇలాంటి దాడులను కేంద్రం ఆపలేకపోయిందని విమర్శించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ వైఫల్యమే ఈ దాడికి ప్రధాన కారణమన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో భారత ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి.. వారిని ఎదుర్కోవాలన్నారు. ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్‌లో ప్రజలు 35ఏండ్ల తర్వాత స్వచ్ఛందంగా బంద్ పాటించారని చెప్పారు. గాయపడిన అనేక మందిని స్థానిక పౌరులు ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. బిజెపి, సంఘ్‌పరివార్, ఆర్ఎస్ఎస్ శక్తులు ఈ ఘటనను ఉపయోగించుకుని దేశంలో ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తున్నాయని తెలిపారు. మనది అనేక మతాలు, భాషలు, సంస్కృతులు, వైవిధ్యాలు కలిగిన దేశమని, ఇక్కడ ఎలాంటి అలజడి జరిగినా ఉగ్రవాదుల కోరికలను నెరవేర్చిన వాళ్లమవుతామని అన్నారు. అందువల్ల ప్రజలందరూ ఐకంగా ఉండి కాశ్మీర్ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఉగ్రవాదుల దాడి జమ్ము కాశ్మీర్ ప్రజల ఆదాయ మార్గాలపై తీవ్ర ప్రభావం చూపించాయన్నారు. అనేకమంది టూరిస్టులు కాశ్మీర్‌ను వదిలి సొంత స్థలాలకు వెళ్లిపోతున్నారన్నారు. కేంద్రం జమ్మూ కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, కెఎన్.రాజన్న, ఎం.దశరథ్, కె.నాగలక్ష్మి, నాయకులు ఆర్.వెంకటేష్, జె.కుమారస్వామి, ఎన్.మారన్న, పద్మ, వరలక్ష్మి, జి.నరేష్, ఆర్.అశోక్, కె.అజయ్ బాబు పాల్గొన్నారు.

20న గ్రామాల్లో హర్తాళ్‌లు, రాస్తారోకోలు

- ఆర్ఎస్ఎస్, బిజెపితో రాజ్యాంగానికి ముప్పు
- ఆహార ధాన్యాల ఉత్పత్తిపై కార్పొరేట్ల కన్ను
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బిజెపి కార్పొరేట్, హిందుత్వ, మనువాద విధానాలను నిరసిస్తూ, గ్రామీణ ధనిక వర్గానికి వ్యతిరేకంగా మే 20న గ్రామాల్లో హర్తాళ్‌లు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలనీ, అందులో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బికెఎంయు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ..మన దేశంలో పండించే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై కార్పొరేట్ కంపెనీల కన్ను పడిందనీ, అందుకే మోడీ సర్కారు కంపెనీ వ్యవసాయాన్ని ముందుకు తీసుకురావడంలో భాగంగా నూతన వ్యవసాయ చట్టాలను తేవాలని చూస్తున్నదని ఎత్తిచూపారు. దీనివల్ల దేశంలో ఆహార భద్రతకు ప్రమాదం వస్తుందని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టానికి 2.5 లక్షల కోట్ల రూపాయల నిధులను బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా...కేంద్ర ప్రభుత్వం దాన్ని కేవలం రూ.86 వేల కోట్లకే పరిమితం చేసిందని విమర్శించారు. సంపద కేంద్రీకృతం కాకుండా అందరి చేతుల్లోనూ ఉండాలని ఆదేశిక సూత్రాలు చెబుతుంటే..దానికి భిన్నంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంపద కొందరి చేతుల్లోనే పోగుపడే నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు పోతున్నదని విమర్శించారు. దేశంలో అంటరానితనం పోవాలి...లౌకికకత్వం ఉండాలి...పౌరులందరూ సమానమే.. అని రాజ్యాంగం చెబుతుంటే అవేవి ఉండటం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, ఆర్ఎస్ఎస్‌కు అస్సలు ఇష్టం లేదని తెలిపారు. గ్రామాల్లో నూతన రూపాల్లో పెత్తందారుల అజమాయిషీ పెంచే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. గ్రామాల్లోనూ సంపద కొంత మంది వద్దనే పోగుపడుతున్నదనీ, వారి పిల్లలే ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారనీ, వారే గ్రామ రాజకీయాన్ని ప్రభావితం చేస్తున్నారని వివరించారు. లేబర్ కోడ్‌లు, నూతన వ్యవసాయ చట్టాల వల్ల జరగబోయే ప్రమాదాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య మాట్లాడుతూ..మోడీ సర్కారు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. పేదలకు అందించే సంక్షేమ పథకాల నుంచి క్రమంగా తప్పుకుంటున్నదనీ, మరోవైపు కార్పొరేట్లకు రాయితీల మీద రాయితీలు ఇస్తూ పోతున్నదని తెలిపారు. కరోనా కాలంలో రూ.20 లక్షల కోట్లను కార్పొరేట్ల కోసం ఖర్చుపెట్టిన తీరును ఎండగట్టారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి చేస్తున్న తీరును వివరించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్‌లో మే 20 గ్రామీణ బంద్ జయప్రదం ఆవశ్యకతపై తీర్మానాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి మద్దతుగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.ఆశయ్య, డివైఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి బి. జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బి.పద్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్, బికెఎంయు నాయకులు జె.అంజయ్య, ఎస్.లక్ష్మయ్య, రాములుగౌడ్, హాజీజ్, యశోద, బుచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంజనేయులు, తదితరులు మాట్లాడారు.

తెలంగాణ టూరిస్టులను రప్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణకు చెందిన టూరిస్టులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకుచర్యలు తీసుకుంటున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వారికి తగిన సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో పాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు.

తెలంగాణ ప్రజల సేవే మా లక్ష్యం

- రజతోత్సవ సభను విజయవంతం చేయండి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మాది ఉద్యమ పార్టీ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కలపల్లి రవీందర్రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తదితరులు గురువారం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పడిన పార్టీ బిఆర్ఎస్ అని, 2001లో పుట్టినప్పటి నుంచి ప్రతేడాది ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. ఇప్పుడు 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చింతలపల్లి వద్ద రజతోత్సవ సభను జరుపుకోబోతున్నామన్నారు. 2001లో కెసిఆర్ పిడికిలి బిగించి పార్టీని స్థాపించి 14 సంవత్సరాలు ఉద్యమం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆడబిడ్డలకు రూ.2500, స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి మొండి చేయి చూపిందని విమర్శించారు. రైతులకు కాళేశ్వరం నీటితో కెసిఆర్ పంటలు పచ్చగా పండేందుకు కృషి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సరైన ప్రణాళిక లేక పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. 16 నెలల్లోనే కాంగ్రెస్ చేతగాని పార్టీ అని తేలిపోయిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చినందుకు ప్రజాసేవ చేయాలని హితవు పలికారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 27న నిర్వహించనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను వరంగల్ సిపి సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించి బందోబస్తు గురించి వివరించారు.

నిప్పుల కొలిమి.. భానుడి భగభగలు

- ఇంట్లో ఉక్కపోత.. బయట ఎండదెబ్బ
- 11 జిల్లాల్లో రెడ్.. 19 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్
- కంపెనీల్లో మగ్గుతున్న కార్మికులు
- ఇజిఎస్, హమాలీ, ఇతర శ్రామికులు
- వడదెబ్బకు పలువురు మృతి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భానుడి భగభగలతో వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. ఉత్తర తెలంగాణ మండిపోతోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు మూడు డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండడంతో జనం అల్లాడిపోతున్నారు. ఇంట్లో ఉక్కపోత.. బయట వడదెబ్బతో తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. భానుడు ఉగ్రరూపం దాల్చి విరజిమ్ముతున్న సూర్యరశ్మి తాకిడికి తట్టుకోలేని పరిస్థితులే ఏర్పడుతున్నాయి. మధ్యాహ్నం బయట అడుగుపెట్టే పరిస్థితి లేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. రెక్కాడితే తప్ప డొక్కాడని శ్రామిక జనం మాత్రం సూర్యుడితో ఢీ కొనక తప్పట్లేదు. ఉత్తర తెలంగాణతో పాటు ఇతర కొన్ని జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్ ప్రకటించినందున ప్రజలు ఎండల్లో తిరగొద్దని అనివార్యంగా బయటికి వెళ్లాల్సి వస్తే జాగ్రతలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండ భగ భగలు.. వడ గాల్పుల ప్రభావంతో పగలే కాదు.. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయి. వాతావరణశాఖ ఇప్పటికే ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో రెడ్ అలర్డ్ ప్రకటించింది. మిగతా ప్రాంతంలోనూ ఎండల తీవ్రత పెరగనున్నందున ఆరెంజ్ అలర్ట్‌ను సూచించింది. రాష్ట్రంలో బుధ, గురువారాలతో పాటు శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే అధికంగా ఉండే పరిస్థితి ఉందని ఐఎండీ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు బయటికెళ్లే పరిస్థితిలేదు. ఉదయం 11 దాటిందంటే సూర్యుడి వైపు కన్నెత్తి చూడలేకపోతున్నాం.

11 జిల్లాల్లో రెడ్.. 19 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగినందున వాతావరణ శాఖ పలు హెచ్చరికలు జారీ చేసింది. పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్న 11 జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను ప్రకటించింది. ముఖ్యంగా అదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, అసిఫాబాద్, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, మెదక్ వంటి జిల్లాల్లో 44.5 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అదే విధంగా మరో 19 జిల్లాల్లో ఆరంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట వంటి జిల్లాలున్నాయి. పగటి పూట అత్యవసరమైతే తప్ప జనం బయటికెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఎండల తీవ్రత వల్ల వడదెబ్బకు గురై ఏడుగురు చనిపోయారు. నిర్మల్, కరీంనగర్, ఖమ్మం, పెద్దపల్లి, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో వడదెబ్బ మరణాలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలో బుధవారం 43.4 డిగ్రీలు, గురువారం 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం మరో ఒకటి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరగనున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. వడగాల్పుల తీవ్రత పెరగనుందని పేర్కొంది. ఎండల్లో మగ్గుతున్న శ్రామికులు

ఎండ దెబ్బ ఎంతటి భరించరానిదైనా పొట్ట నింపుకునేందుకు శ్రామికులు ఎండల్లో మగ్గక తప్పదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న పరిశ్రమల్లో 2.50 లక్షల మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. ఫార్మా కంపెనీల్లో మండుతున్న కొలిమిల్లో పనిచేస్తున్న కార్మికులు కంపెనీల్లో వెలువడే వేడితో పాటు బయటి ఉష్ణోగ్రతలకు తల్లడిల్లిపోతూ పని చేస్తున్నారు. ముఖ్యంగా లక్షకుపైగా ఉన్న వలస కార్మికులు పారిశ్రామిక ప్రాంతాల్లో రేకుల షెడ్లు, టార్పాలిన్లతో కట్టుకున్న గుడారాల్లో మగ్గుతూ పని చేస్తున్నారు. మరో పక్క ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వెయ్యి గ్రామాలకుపైగా రోజూ ఎండల్లో ఉపాధి కూలీలు మగ్గుతున్నారు. ఎలాంటి నీడకు నోచని కూలీలు సూర్యుని భగభగలు నెత్తిన పడుతున్నా నిప్పుల కొలిమిని తట్టుకోలేకపోతున్నారు. 1113 ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లల్లో కీలకంగా పని చేస్తున్న హమాలీ కార్మికులు ఎండల్లో కష్టపడుతున్నారు. వ్యవసాయ పనులు సాగుతున్నందున రైతు, కూలీలు సైతం ఎండల్లో పనులు చేసుకోవాల్సి వస్తుంది. ఇక పట్టణాల్లో వీధి వ్యాపారులు నిలువ నీడలేకపోయినా రోడ్ల వెంట తల్లడిళ్లుతున్నారు.

పెళ్లిళ్లు, శుభకార్యాలపై ప్రభావం

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ షురూ అయ్యింది. మే వరకు పెళ్లి సందడి కొనసాగనుంది. ప్రస్తుతం ఎండలు 44 డిగ్రీల వరకు నమోదవుతున్నందున గురువారం ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన పెళ్లిలకు జనం సందడి తగ్గింది. దూర ప్రాంతాలకు కుటుంబ సభ్యులంతా ఎండల్లో ప్రయాణం చేయానికి భయపడుతున్నారు. బస్సుల్లో రద్దీ ఉండడం, స్వతహాగా వాహనాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇంటి నుంచి ఒకరిద్దరు మాత్రమే పెండ్లికి హాజరవుతున్నారు.

స్విమింగ్ పూల్స్‌లో సేద తీరుతున్న వైనం

ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం చిన్నారుల్ని పొద్దున, సాయంత్రం స్విమింగ్ పూల్స్‌కు తీసుకెళ్తున్నారు. పట్టణాల్లో ప్రయివేట్ స్విమింగ్‌పూల్స్‌కు గిరాకీ పెరిగింది. ఈత నేర్పడంతోపాటు ఎండల నుంచి ఉపశమనం కోసం స్విమింగ్‌పూల్స్‌కు వెళ్తున్నారు. ఊర్లల్లో ఊట బావుల్లో, మత్తడిదూకే చెరువుల్లో పిల్లలు పెద్దలు ఈత కొడుతున్నారు. తాటిముంజలకు గిరాకీ పెరిగింది.

ఎండలకు బయటికెళ్లొద్దు: డాక్టర్ అనిల్, వైద్య నిపుణులు

ఎండల తీవ్రత పెరిగినందున బయటికెళ్లకుండా ఉండాలి. అనివార్యంగా బయటికెళ్లాల్సి వస్తే గొడుగు, చేతి రుమాలు, టవల్స్ వంటివి కప్పుకోవడం మంచిది. మంచినీళ్లను వెంట తీసుకెళ్లాలి. తరచూ నీటిని తీసుకోవడం ద్వారా శరీర ఉష్ణోగ్రతలు పెరగకుండా చూసుకోవాలి. దాహార్తి తీర్చుకునేందుకు వెంటవెంటనే నీళ్లు తాగొద్దు. శరీర ఉష్ణోగ్రతలు చల్లబడిన తర్వాత నీటిని తీసుకోవాలి. మజ్జిగ, చల్లటి పానీయాలు, రసాల వంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలి.



సదస్సులో మాట్లాడుతున్న భూపాల్

వలస కార్మికులకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలి

- మే 20న జరిగే సమ్మెలో వలస కార్మికులు పాల్గొనాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వలస కార్మికులను కట్టు బానిసలుగా పరిశ్రమల యజమాన్యాలు, సంస్థలు చూస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో జరిగిన వలస కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. వలస కార్మికులను బానిసల్లాగా పరిశ్రమల, సంస్థల యజమానులు చూస్తున్నారని, ఈ పద్ధతి వెంటనే మారాలన్నారు. వలస కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల చట్టాన్ని మొత్తం నీరుగార్చిందని అన్నారు. వలస కార్మికులకు పని గంటలు, కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా, సెలవులు ఏ ఒక్క హక్కు కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రమాదాల్లో చనిపోతే శవాలను కూడా మాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలు, సంస్థలు, భవన నిర్మాణాలు, ప్రాజెక్టుల్లో వలస కార్మికులు గాయపడితే కనీసం ఆస్పత్రిలో కూడా చూపించడం లేదని తెలిపారు. కనీస వేతనాలు, ఇఎస్ఐ కార్మిక చట్టాలను అమలు చేయని యజమానులపైన క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. వలస కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పథకాన్ని తేవాలని కోరారు. లేబర్ కోడ్‌ల వల్ల వలస కార్మికులు తమ హక్కులను కోల్పోతారని, అందుకే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులందరూ ఐక్యమత్యంతో పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మే 20న జరిగే సమ్మెలో వలస కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, పాల్గొన్నారు.

రేపు బిఎఎ ట్రైనింగ్ పైలట్ ఓరియంటేషన్ దినోత్సవం

హైదరాబాద్: అంతర్జాతీయ విమానయాన అకాడమీలలో ఒకటైన బిఎఎ ట్రైనింగ్ ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో తమ పైలట్ ఓరియంటేషన్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపింది. రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో ఏర్పాటు చేస్తోన్న ఈ కార్యక్రమానికి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది.

సింజెంటా 'బయో ఆగ్ కాంగ్రెస్' రోడ్‌మ్యాప్

హైదరాబాద్: వినూత్నమైన బయోలాజికల్స్ ద్వారా పర్యావరణ అనుకూల వ్యవసాయాన్ని పెంపొందించేందుకు బయో ఆగ్ కాంగ్రెస్‌ను నిర్వహించినట్లు సింజెంటా ఇండియా తెలిపింది. 2050 నాటికి 50 శాతం ఎక్కువ పంటలు పండించాల్సిన అవసరం ఉన్నందున ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, సరసమైన రీతిలో ఆహారాన్ని అందించడానికి వీలుగా రోడ్‌మ్యాప్ ప్రణాళికలను ఆవిష్కరించినట్లు సింజెంటా ఇండియా ఎండి సుశీల్ కుమార్ పేర్కొన్నారు. ఆహార భద్రతకు హామీ ఇవ్వడంలో రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. వీటి పరిష్కారానికి వినూత్న పరిష్కారాలు అవసరమన్నారు.

హైదరాబాద్‌లో మరో టిబిజడ్ ది ఒరిజినల్ స్టోర్

ప్రజాశక్తి - హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించినట్లు అభరణాల రిటైల్ చెయిన్ టిబిజడ్ ది ఒరిజినల్ తెలిపింది. కొత్తగా కొండాపూర్‌లో తమ 3వ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. దీన్ని నటీ పాయల్ రాజ్‌పుత్ లాంఛనంగా ప్రారంభించారు. అత్యధిక కొనుగోలు సీజన్ అయిన అక్షయ తృతీయ మాసంలో ఈ స్టోర్ ప్రారంభించబడడం సంతోషంగా ఉందని ఆ సంస్థ సిఎండి శ్రీకాంత్ జవే తెలిపారు. నూతన స్టోర్‌లో పలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

- అనుమానాస్పద ఘటనగా కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హాస్టల్ భవనం పైనుంచి దూకి డిగ్రీ సెకండియర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. మంచిర్యాల పట్టణ సిఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం జగ్గయ్యపేటకు చెందిన లక్ష్మి ప్రసన్న (20) జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు. ఉదయం 8 గంటల సమయంలో హాస్టల్ బిల్డింగ్ 4వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని కళాశాల యాజమాన్యం వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ లక్ష్మి ప్రసన్న మృతిచెందారు. విద్యార్థిని తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద ఘటనగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని మృతికి కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు వాచ్‌మెన్‌లే కారణమంటూ బాధితకుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి ముందు నిరసన చేపట్టారు. సంఘటన స్థలానికి ఎసిపి ఆర్.ప్రకాష్, అదనపు కలెక్టర్ మోతిలాల్ వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మొక్కలను పరిశీలిస్తున్న జంగా రాఘవరెడ్డి, తదితరులు

ఆయిల్ పామ్‌లో పూత, కాత లేని మొక్కలు

- వైఫల్యం ఎక్కడనేది తెలియాల్సి ఉంది
- ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆయిల్ పామ్ సాగులో పూత, కాత లేని మొక్కలు ఉన్నాయనేది తేలిందని, వైఫల్యం ఎక్కడనేది పరిశీలిస్తున్నామని టీజీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట, గంగారం, వాగొడ్డుగూడెం గ్రామాల్లోని రైతులు నున్నా కృష్ణారావు, కుంచం సుబ్బారావు, కుంచం వెంకటేశ్వరరావు, సంక నాగబాబు ఆయిల్ పామ్ తోటల్లో ఉన్న వంధ్యత్వ మొక్కలను విశ్రాంత ఐఐఒపిఆర్ అధికారి బిఎన్ రావు, ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. 2017-22 మధ్య కాలంలో నాటిన మొక్కలకే ఎందుకిలాంటి పరిస్థితి ఎదురైంది అనేది తెలుసుకునేందుకు వచ్చినట్టు తెలిపారు. నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంలోనే పొరపాటు జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. విశ్రాంత ఐఐఒపిఆర్ అధికారి బిఎన్ రావు మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలు పెంపకంలో అలసత్వం, మొక్కలకు సోకే చీడపీడలు పట్ల నిర్లక్ష్యంగా ఉన్నా అనారోగ్యంతో మొక్కలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వాటిని సకాలంలో గుర్తించి కల్లింగ్ చేయకపోవడం వల్లనే పూత, కాత రాని వంధ్యత్వ మొక్కలుగా మారాయన్నారు. చైర్మన్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. తోటల్లో అయిదు నుంచి పది శాతం మొక్కలు కాపు లేకుండా ఉండటం సహజమేనని అన్నారు. ఈ వైఫల్యాన్ని ఎలా అధిగమించాలి, ఏమి చేస్తే రైతుకు న్యాయం జరుగుతుందో తెలుసుకునేందుకే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు.

డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

- 2400 స్పాస్మో టాబ్లెట్స్ స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నల్లగొండ డిఎస్‌పి కె.శివరామిరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొంతకాలంగా స్పాస్మో టాబ్లెట్స్ (డ్రగ్స్) సేవిస్తూ వాటికి బానిసవ్వడంతోపాటు విక్రయాలు చేసేందుకు జిల్లా కేంద్రంలోని అక్కచెల్మకు చెందిన వసీం, అతని స్నేహితులు ఖాజా షోయబ్, అమేర్ ముఠా ఏర్పడ్డారు. ఆరు నెలల నుంచి పిడుగురాళ్లలోని ఛాయా మెడికల్‌షాప్ నిర్వాహకుడు మణిదీప్ దగ్గర ఒక షీటును వంద రూపాయలకు కొని, ఆ టాబ్లెట్‌లను వినియోగిస్తూ అవసరం ఉన్నవారికి రూ.180కు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ నెల 23న ఉదయం 11 గంటల సమయంలో మునుగోడు రోడ్డులో నల్లగొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్‌రెడ్డి, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా బైక్‌పై బ్యాగుతో ఉండగా, అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. మమ్మద్ ఖాజా, వసీముద్దీన్ కలిసి 288 టాబ్లెట్స్ షీట్స్ అమ్మేందుకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. మెడికల్ షాప్ నిర్వాహకుడు మణిదీప్‌ను పట్టుకొని అతని వద్ద స్పాస్మో టాబ్లెట్స్ 15 షీట్స్, సెల్‌ఫోన్, షాపు డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వసీముద్దీన్, మణిదీప్‌ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కి పంపారు. సీజ్ చేసిన 25,000 విలువగల 2400 స్పాస్మో టాబ్లెట్స్, బైక్, రూ.22,000, సెల్ ఫోన్లను కోర్టులో సమర్పించారు.

ఖైరతాబాద్ ఆర్‌టిఎ కార్యాలయానికి రాజమౌళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్ ఆర్‌టిఎ కార్యాలయానికి వచ్చారు. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ కోసం రాజమౌళి రావడంతో ఆయనకు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ) సి.రమేష్ స్వాగతం పలికారు. ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆయన అక్కడి నిర్దేశిత ఫార్మాట్‌లో దరాఖాస్తును నింపి అధికారులకు అందజేయగా, ఆ మేరకు అవసరమైన డిజిటల్ సంతకంతో పాటు ఫొటో ప్రక్రియ పూర్తిచేసి.. డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు.

వరంగల్‌లో 14 మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ(మావోయిస్టు) చెందిన 14 మంది మావోయిస్టులు గురువారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో మల్టీజోన్ 1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో వీరంతా లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, పార్టీ సభ్యులు ఏడుగురు, మిలీషియా కమాండర్ 1, మిలీషియా సభ్యులు నలుగురు మొత్తం 14మంది ఉన్నారు. ఆంధ్రా, ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీలో పనిచేసిన గాలికొండ ఏరియా కమిటీ సభ్యులు మడవి అంద అలియాస్ రాజేష్, కేంద్ర కమిటీ సభ్యులు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ప్రొటెక్షన్ టీమ్‌లో పని చేసిన ఏరియా కమిటీ సభ్యులు సోడి కోసి, డివిజన్ కమిటీ సభ్యులు మరకం హిడుమే, మడకం జోగి అలియాస్ కోవాసి జోగి, పోడియం భూమిక అలియాస్ సోడి కోసి అలియాస్ వెన్నెల, సోడి బుద్రి, కోవాసి ఇడుమ, కోర్సా లాలు, హేమ్లా సుక్కు అలియాస్ అర్జున్, కోర్సా సుక్కు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు ఆ పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో అనేక విధ్వంసకర సంఘటనలకు, పోలీసులపై దాడి చేసిన ఘటనలో, అమాయక ప్రజలను ఇన్‌పార్మర్ల నెపంతో హత్య చేసిన సంఘటనల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక రాష్ట్ర కమిటీ సభ్యురాలితో పాటు 250మంది మావోయిస్టులు లొంగిపోయారని ఐఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతల్లో పలువురు అనారోగ్య సమస్యలతో పాటు, వృద్ధాప్యంతో బాధపడుతున్నారని, వారంతా లొంగిపోతే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఇచ్చే పునరావాసంతో జీవనం కొనసాగించవచ్చన్నారు.

ఆర్‌యుపిపిటిఎస్ నూతన అధ్యక్షులుగా జగదీశ్

- ప్రధాన కార్యదర్శిగా శంకర్

హైదరాబాద్ బ్యూరో : ఆర్‌యుపిపిటిఎస్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా సి.జగదీశ్, ప్రధాన కార్యదర్శిగా ములుకనూరి శంకర్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా కొండ యాదగిరి, ఉపాధ్యక్షులుగా చక్రవర్తుల రమణాచార్యులు, మహిళా ఉపాధ్యక్షులుగా రమాదేవి, కోశాధికారిగా కట్ట గిరిజా రమణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కె వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అశోక్, గోలి ప్రకాశ్, జె మహేందర్‌రెడ్డి, డింగరి రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్, శంకర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాట ఫలితంగా పండితుల అప్‌గ్రెడేషన్ సాధ్యమైందన్నారు. 1/2005 యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిపోయిన భాషాపండితులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.



విజన్ ఐఎఎస్ టాపర్స్‌తో సెమినార్

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని విజన్ ఐఎఎస్ అకాడమీలో యుపిఎస్‌సి ఛాంపియన్స్‌తో ప్రత్యేక సెమినార్‌ను ఏర్పాటు చేశారు. దీనికి యుపిఎస్‌సి సిఎస్ఇ 2024 విజేతలు ఉదయ్ కృష్ణారెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ 350), సిహెచ్ సౌమ్య (951 ర్యాంక్) హాజరయ్యారని ఆ సంస్థ పేర్కొంది. పోలీస్ కానిస్టేబుల్ నుండి ఐపిఎస్ అధికారిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఉదయ్ కృష్ణారెడ్డి స్ఫూర్తిదాయకమైన తప ప్రయాణాన్ని వివరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) గౌహతి పూర్వ విద్యార్థి సౌమ్య బిటెక్ పూర్తి చేసింది. అవిశ్రాంత అంకితభావం, మేధో పరమైన జ్ఞానం మరియు స్థిరమైన కృషికి ఆమె విజయం నిదర్శనమని విజియోనియాస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ కృష్ణ సింగ్ పేర్కొన్నారు.

భారత్ ఎలక్ట్రానిక్స్‌లో ఫిక్స్‌డ్ టర్మ్ ఇంజనీర్లుగా గీతం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మరో ఘనత సాధించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇసిఇ విభాగం చివరి ఏడాది విద్యార్థులు ముగ్గురు ప్రాంగణ నియామకాల్లో రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్)కు ఎంపికైనట్టు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బిఇఎల్‌లో ఫిక్స్‌డ్ టర్మ్ ఇంజనీర్స్ (ఈ-2 గ్రేడ్)గా ఐదేళ్ల పదవీకాలానికి భట్టు సాయిశ్రీజ, గాయత్రి రచన త్రిపురాణ, కక్కిరేణి మణికంఠ.. ఎంపికైనట్టు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ నియామక ప్రక్రియలో బిఇఎల్ నిర్వహించిన రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఈ ముగ్గురిని ఎంపిక చేశారన్నారు. ఈ సమాచారాన్ని అధికారికంగా బిఇఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ ఏప్రిల్ 23న అధికారిక లేఖ ద్వారా గీతంలోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ)కి తెలియజేశారని తెలిపారు. విజయాన్ని సాధించిన విద్యార్థులను గీతం మేనేజ్‌మెంట్ హృదయపూర్వకంగా అభినందించినట్టు తెలిపారు. గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, సీజీసీ డైరెక్టర్ డాక్టర్ కె.మమతా రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ టి.లోకేష్, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి తదితరులు విద్యార్థులను అభినందించారు.

కన్నయ్య మరణానికి కారకులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు

- ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ప్రజాసంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌టి ఆదివాసీ కులానికి చెందిన నాయిని కన్నయ్య మరణానికి కారణమైన చిన్నన్నరెడ్డి, వారి కుటుంబ సభ్యులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశాయి. దీనిపై చైర్మన్ స్పందిస్తూ నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలనీ, బాధితులకు తగిన న్యాయం చేయాలని సంబంధిత జిల్లా అధికారులకు ఫోన్ ద్వారా ఆయన ఆదేశాలిచ్చారు. మంచిర్యాల జిల్లా మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య (28)ను అదే గ్రామానికి చెందిన ఎనగంటి చిన్నన్న రెడ్డి నెల నెలా జీతం ఇవ్వకపోగా పెండింగ్ జీతం అడిగితే, భూతులు తిట్టేవారని ప్రజాసంఘాల నేతలు తెలిపారు. అంతటితో ఆగకుండా కన్నయ్య కుటుంబానికి చెందిన ఎకరం భూమిని ఎనగంటి హరీష్ రెడ్డి అక్రమంగా 2019లో పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. కన్నయ్యను ఆర్థికంగా, మానసికంగా కులం పేరుతో వేధించటంతో పురుగుల మందు తాగి చనిపోయారని తెలిపారు. బాధిత కుటుంబానికి ఐదెకరాల భూమి, రూ.50 లక్షల నష్టపరివారం ఇవ్వాలని కోరారు. కన్నయ్య కుమారుడి చదువుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాములు, కుక్కలు కాటేస్తున్నాయి..

- కోఠి మహిళా వర్సిటీలో విద్యార్థినుల ఆందోళన
- విసి ఛాంబర్ ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. యూనివర్సిటీ హాస్టల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం యూనివర్శిటీ విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ కార్యాలయాన్ని ముట్టడించారు. హాస్టల్ సమస్యలు పరిష్కరించడంలో విసి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కుక్కలు, ఎలుకలు, పాములు తిరుగుతున్నాయన్నారు. గతంలో కుక్కలు పలువురు విద్యార్థినులను కరిచినట్టు తెలిపారు. ఓ విద్యార్థిని పాము కాటుకు గురైనట్టు చెప్పారు. వార్డెన్‌కు ఎన్నిసార్లు సమస్య చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. తాగడానికి నీరు కూడా రావడం లేదన్నారు. సుల్తాన్ బజార్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

హాస్టల్ భవనాన్ని సందర్శించిన విసి

విద్యార్థినుల ఆందోళనతో విసి హాస్టల్ భవనాన్ని సందర్శించారు. హాస్టల్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ లోక పావనితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ.. కొంతకాలంగా హాస్టల్‌లో నీళ్ల సమస్య ఉండటం వాస్తవమేనని, సమస్య పరిష్కారానికి రెండు బోర్లు వేయించామని తెలిపారు. దోమలు, పాములు, కుక్కలు, ఎలుకల బెడద ఎక్కువగా ఉందని, తరచూ ఎలుకలు కరుస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారని అన్నారు. వీటి పరిష్కారం కోసం ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. అయితే, విద్యార్థినులు పరీక్షలు వాయిదా వేయాలని కోరగా.. తాము యథావిధిగా నిర్వహిస్తామని చెప్పడంతోనే హాస్టల్ సమస్యలను ముందుకు తెచ్చారని ఆరోపించారు.



విసి ఛాంబర్‌ను ముట్టడించిన విద్యార్థినులు